క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో చాకలి చంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు జగదీశ్వర్ రూ.6వేలు, నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ రూ.5వేల చొప్పున ఆర్థికసాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, నరేశ్‌యాదవ్, గణేశ్‌గౌడ్, రమేశ్, శంకర్, శ్రీధర్, సాయిలు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

కేశంపేట: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎంపికైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను మండలానికి చెందిన బీజేపీ నాయకులు శంషాబాద్‌లోని కార్యాలయంలో సోమవారం కలిసి సన్మానించారు. పార్టీని గ్రామస్థాయిలో ఇంటింటికీ తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని జిల్లా అధ్యక్షుడు సూచించినట్టు మండల నాయకులు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించే విధంగా కార్యకర్తలు కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్, సాంస్కృతిక శాఖ జిల్లా కో–కన్వీనర్ కర్రెద్ల నరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కుమార్‌గుప్తా, సురేశ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన కందూరి మనోహర్‌రెడ్డిని సోమవారం బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కందూరి మనోహర్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, సుధాకర్ అప్ప, బాల్‌రెడ్డి, కుదుముల బాల్‌రాజ్, రంగన్నగౌడ్, పులీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై విచారణ జరపాలి

కలెక్టర్‌కు తోల్‌కట్ట గ్రామస్తుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: తోల్‌కట్ట గ్రామంలో ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ ల్యాండ్స్ ఉన్నప్పటికీ ఉన్నతమైన వారికి పట్టాలు ఇస్తున్నారని, పేదల భూములను ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి తోల్‌కట్ట గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి వివరించారు. సోమవారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తోల్‌కట్ట గ్రామంలో సర్వే నంబర్ 107 విస్తీర్ణంలో 12 ఎకరాల 16 గుంటల భూమి లావణ్య పట్టా ఉందని, వివిధ సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఉన్నత వారికి పట్టాలు పాస్‌బుక్‌లు వస్తున్నాయే తప్పా పేదవారికి సాగు చేసుకునే భూములు కూడా లేకుండా లాక్కుంటున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి తోల్‌కట్ట గ్రామంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములు రైతులు సాగు చేసుకుంటుంటే అధికారులు లాక్కుంటున్నారని వివరించారు. కానీ ఉన్న వారికి అసైన్‌మెంట్ భూములు పట్టాలు చేసి ఇస్తున్నారని, దీనిని కలెక్టర్ పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తోల్‌కట్ట గ్రామంలో అసైన్‌మెంట్ భూములు వంద ఎకరాలు ఉన్నప్పటికీ అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని కాపాడాలని కోరారు.

జీపీలకు భవనాలు కరువు

- కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ
- కనీస వసతులు లేక తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కొడిచర్లతండాలో ప్రభుత్వ పాఠశాల గదిలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయం

కొత్తూరు: పల్లెల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్యకలాపాలకు పంచాయతీ భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. కానీ మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లలో తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. కాగా వాటికి సొంత భవనాలు లేకపోవడం.. భవనంలో కనీస వసతులు లేని కారణంగా ప్రజాప్రతినిధులు, విధులు నిర్వహించే అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలు గ్రామాల్లోని సొంత భవనాలు ఉన్నా ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి.

12 జీపీల్లో..

కొత్తూరు మండలంలో 2011 లెక్కల ప్రకారం 20,123 జనాభా ఉంది. ఇక్కడ 10 పంచాయతీలు ఉండగా ఇటీవల కొత్తగా మరో 4 పంచాయతీలు ఏర్పడ్డాయి. తర్వాత తిమ్మాపూర్, కొత్తూరు పంచాయతీలు మున్సిపాలిటీగా రూపాంతరం చెందడంతో ప్రస్తుతం 12 గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి.

కనీస సౌకర్యాలు కరువు..

గత ప్రభుత్వం పాలన సౌలభ్యంలో భాగంగా సుమారు 500ల జనాభా ఉన్న అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చింది. వీటితో పాటే ప్రత్యేక అవసరాల దృష్ట్యా మరికొన్ని గ్రామాలు, తండాలను సైతం పంచాయతీలుగా చేసింది. కాగా నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు చాలా వరకు సొంత భవనాలు లేవు. కొన్ని చోట్ల అద్దె భవనాలు.. మరికొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలల అదనపు గదుల్లో.. ఇంకొన్ని చోట్ల ఆయా సంఘాలకు చెందిన కమ్యూనిటీ భవనాల్లో పంచాయతీలు కొనసాగుతున్నాయి. పాత, కొత్తగా ఏర్పడిన ఆయా పంచాయతీ కార్యాలయాల్లో కనీస వసతులు తాగు నీరు, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు లేక ప్రజాప్రతినిధులతో పాటు విధులు నిర్వహించే అధికారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. వారితో పాటు ఆయా సమావేశాలు, ఇతర కార్యక్రమాలు, పనుల కోసం వచ్చే ప్రజలు కూడా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



సిద్ధాపూర్‌లో శిథిలావస్థకు చేరిన కార్యాలయం

పంచాయతీల వివరాలు..

మండలంలోని కొడిచర్లతండా పంచాయతీ కార్యాలయం ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల్లో కొనసాగుతోంది. అదేవిధంగా వైఎంతండా జీపీ కార్యాలయం ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల్లో కొనసాగగా, సిద్ధాపూర్ పంచాయతీ పాలన ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కొనసాగుతోంది. అద్దె భవనాలు ఇరుకుగా ఉండడం, కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సొంత భవనాలు మంజూరు చేయాలి



కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు సొంత భవనాలు మంజూరు చేయాలి. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయాలు పాలనకు సరిపోవడం లేదు. అంతంతమాత్రంగా సౌకర్యాలు ఉండడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

– సంతోష్‌నాయక్, మాజీ సర్పంచ్ కొడిచర్లతండా

అధికారులకు నివేదించాం



కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్, వైఎంతండా, కొడిచర్లతండాల్లో కొత్త గ్రామ పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. ప్రస్తుతం కొనసాగుతున్న భవనాల పరిస్థితిపై అధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– అరుంధతి, ఎంపీడీఓ, కొత్తూరు

వైద్యం కోసం నిరీక్షణ

సమయపాలన పాటించని వైద్యులు



ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

షాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు సమయ పాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోగులు వైద్య సేవల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం 11:30 గంటల వరకు ఒక్క డాక్టర్ కూడా రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. స్టాఫ్ నర్స్ మాత్రమే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



షాబాద్ ఆస్పత్రిలో రోగుల ఎదురుచూపులు

గాలివాన బీభత్సం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి, భీమారం అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం సుమారు గంటకుపైగా వడగళ్లతో భారీ వర్షం కురిసింది. ఫలితంగా ఆయా గ్రామాల్లో ఉన్న మామిడి తోటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు మామిడి చెట్లు విరిగిపడి, కాయలు నేలరాలా యి. అదేవిధంగా టమాటా, పచ్చిమిర్చి, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా రైతులు భారీగా నష్టపోయారు. రైతులు ప్రభు త్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



కంసాన్‌పల్లిలో నేలరాలిన మామిడికాయలు

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ కాంతారెడ్డి

సీఐ కాంతారెడ్డి

షాబాద్: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సహించేది లేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంలాల్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలి

ఎమ్మెల్యేకు సీపీఐ నాయకుల వినతి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: చేవెళ్లలోని సర్వే నెం 75లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో సీపీఐ నాయకులు కలిసి గుడిసె వాసులకు ఇళ్లపట్టాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 75 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో పేదలు గత రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. అక్కడ కనీస వసతులు మంచి నీటి సౌకర్యం, కరెంటు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోయినా కాలం వెల్లదీస్తున్నారన్నారని, వారందరికీ మౌలిక వసతులు కల్పించి త్వరగా ఇళ్ల పట్టాలను ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యలపై సానుకులంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, మండల పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మక్బుల్, అంజయ్య, కృష్ణగౌడ్, మంజుల తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని ముస్లింలకు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మర్పల్లి మాలతీకృష్ణారెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి మండలంలోని మల్కాపూర్ బస్‌స్టేజీ సమీపంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు బాసిద్, ఖాదర్, గౌస్, అక్బర్, తాజ్, సలీమ్, ఫరుక్, యూసూఫ్, జహంగీర్, ఖలీల్, నాయకులు ఎం.కృష్ణారెడ్డి, వసంతం, బల్వంత్‌రెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: మానవ సేవయే మాధవ సేవగా భావించి, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. యువజన సంఘాల ఐక్యవేదిక- వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో.. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ సహకారంతో మండల కేంద్రంలోని అన్మాస్‌పల్లి కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం స్థానిక నాయకులతో కలిసి దశరథ్‌నాయక్ ప్రారంభించారు. చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులను స్థానికులు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, కోఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు రాఘవేందర్, లాయక్‌అలీ, కుమార్, అశోక్, బ్రహ్మచారి, శివకుమార్, సందీప్‌రెడ్డి, గోపీకృష్ణ, నాగరాజు, గణేశ్, వెంకటేశ్, కుమార్, చంద్రశేఖర్, మహేశ్ తదితరులు ఉన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: క్షయవ్యాధి నిర్మూలనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షయవ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్ క్లోసిన్ కారణంగా సంభవిస్తుందన్నారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యాధి సోకిన వారిలో దీర్ఘకాలిక దగ్గు, రక్తంతో కూడిన చీమిడి, బరువు తగ్గడం, జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం, శరీర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. క్షయవ్యాధి సోకిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మందులను ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం కోసం ప్రతినెల వేయి రూపాయలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ తాజొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిర్మూలనపై అవగాహన

కేశంపేట: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఆధ్వర్యంలో వ్యాధి నిర్మూలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజులుగా కళాశాల ఆధ్వర్యంలో పాపిరెడ్డిగూడ గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె మాట్లాడుతూ.. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్‌జహన్, బిందుశ్రీ, ముంతాజ్‌బేగం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: చిలుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

మొయినాబాద్‌రూరల్: ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు ప్రణీత్‌కుమార్ అన్నారు. సోమవారం క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఔషధ తయారీ, శాస్త్రంపై ప్రభావం అనే అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్కో ఫార్మా ఉపాధ్యక్షుడు జ్ఞానదేవ్‌తో పాటు ప్రణీత్‌కుమార్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. చిలుకూరు బాలాజీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ కళాశాల చైర్మన్ రమేశ్‌బాబు, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: ఆశవర్కర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో హైదరాబాద్‌ను అడ్డుకొని అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండలంలోని ఆశవర్కర్లను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 18వేల ఫిక్స్‌డ్ వేతనం సాధనకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆశవర్కర్ల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించి అడ్డుకుందని మండిపడ్డారు. ప్రభుత్వం ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

షాబాద్: కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం అని చెప్పుకోవడం సిగ్గుచేటని సీఐటీయూ మండల నాయకుడు శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చిందని గుర్తుచేశారు. ఎన్నికల అనంతరం వారి హామీని గాలికి వదిలేశారని మండిపడ్డారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ఎన్ని అరెస్టులు చేస్తే ఉద్యమాలు అంత ఉవ్వెత్తున ఎగిసిపడతాయన్నారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు ఉన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఆశ కార్యకర్తలు, వీఆర్‌ఎలను పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. పెట్రోలింగ్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ పాండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆశ కార్యకర్తలు సంతోష, వసంత, సరస్వతి, అనిత, వీఆర్‌ఏలు నర్సింహ, శ్రీనివాస్, శ్రీకాంత్, లింగంను అరెస్టు చేశారు. అనంతరం అరెస్టు చేసిన వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

అక్రమ అరెస్టులు సరికాదు

కొత్తూరు: అక్రమ అరెస్టులతో ఆశలు చేపట్టిన నిరసనను ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా నాయకుడు బీస సాయిబాబా అన్నారు. నిరసనకు వెళ్తున్న ఆశలను ముందస్తుగా పోలీసులు సోమవారం అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. కార్యక్రమంలో ఆశలు శ్రీవాణి, కమల, కవిత, జయమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

శంకర్‌పల్లి: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలని ఆశవర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి భవానీ అన్నారు. సోమవారం ఆశవర్కర్ల యూనియన్ తలపెట్టిన నిరసనకు ఆశలు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



చేవెళ్ల: ఆశలతో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



షాబాద్: పోలీసుల అదుపులో ఉన్న ఆశ కార్యకర్తలు



కొత్తూరు: స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సాయిబాబా